సాక్షి ఆదిలాబాద్

బుధవారం | 5 | ఏప్రిల్ | 2023



'కేజీబీవీ'లో ఎంసెట్ కోచింగ్

కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయాల్లో ఎంసెట్ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. జూమ్ యాప్ ద్వారా విద్యార్థులకు ఉదయం, సాయంత్రం వేళల్లో బోధిస్తున్నారు. 8లో▸




'బలగం' ప్రదర్శన

జిల్లాలోని పలుచోట్ల 'బలగం' సినిమాను మంగళవారం రాత్రి ప్రదర్శించారు. బోథ్, తలమడుగు మండల కేంద్రాలతో పాటు నేరడిగొండ మండలం తేజాపూర్ గ్రామంలో ప్రదర్శించారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
39.0/25.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతీవ్రతతో పాటు గాలిలో తేమ శాతం పెరగనుంది. ఉక్కపోత అధికంగా ఉంటుంది.



న్యూస్‌రీల్

ఉచిత గుండె వైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన చిన్న పిల్లల ఉచిత గుండె వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఉమ్మడి జిల్లా నుంచి చాలా మంది తరలివచ్చారు. వైద్య నిపుణులు అముల్ గుప్తా, సతీశ్ పాల్గొని చిన్నారులను పరీక్షించారు. చికిత్స అవసరమైన వారికి ఉచిత సేవలకు గాను తమ ఆస్పత్రికి రెఫర్ చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యులు సుబియ, రాధిక, మేనేజర్ జైవిన్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'పది' పరీక్షలు

ఆదిలాబాద్‌టౌన్: పదో తరగతి పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం ద్వితీయ భాష పరీక్ష నిర్వహించారు. 10,601 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 10,555 మంది హాజరైనట్లు డీఈవో ప్రణీత తెలిపారు. అలాగే ప్రైవేట్ విద్యార్థులు నలుగురికి గాను ఇద్దరు గైర్హాజరైనట్లు వివరించారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



ఇచ్చోడలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ఇచ్చోడ/బజార్‌హత్నూర్: పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. ఇచ్చోడ జెడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేశారు. కేంద్రంలోకి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించవద్దన్నారు. ఎవరైనా అక్రమాలకు పాల్పడేందుకు యత్నిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట తహసీల్దార్ రాథోడ్ మోహన్‌సింగ్ తదితరులు ఉన్నారు. అలాగే బజార్‌హత్నూర్ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంను పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అలాగే స్థానిక పీహెచ్‌సీలోని ఆరోగ్య మహిళ కేంద్రంను సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, జెడ్పీటీసీ నర్సయ్య, ఎంపీపీ జయశ్రీ, తహసీల్దార్ సోము తదితరులున్నారు.

టీఎస్‌పీఎస్సీ లీకేజీపై సీబీఐ దర్యాప్తు అవసరం



సంజయ్‌తో మాట్లాడుతున్న బాధితులు

ఆదిలాబాద్‌టౌన్: టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన పలు ఉద్యోగ నియామకాల్లో 2017 నుంచి అక్రమాలు జరిగాయని పలువురు అభ్యర్థులు ఆరోపించారు. ఈమేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ను మంగళవారం కలిశారు. గురుకుల ప్రిన్సిపాల్ పోస్టుల్లో అక్రమాలు జరిగాయని విన్నవించారు. అర్హత లేనివారికి ఉద్యోగాలను కట్టబెట్టారని ఆరోపించారు. 2017 నుంచి జరిగిన నియామకాలపై సీబీఐ విచారణ చేపట్టేలా చూడాలని కోరారు. అర్హత, అనుభవం లేనివారికి ఉద్యోగాలు కట్టబెట్టారని, అర్హత గల వారిని అనర్హులుగా ప్రకటించి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విత్ హెల్డ్‌లో ఉన్న వారికి వెంటనే నియామక ఉత్తర్వులు ఇచ్చే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. ఆయన వెంట బీజేపీ జిల్లా నాయకులు సుహాసిని, బాధిత అభ్యర్థులు జుట్టు చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.



జిల్లాకేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

ఇంకుడు గుంతలేవి?

- ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్ కాలనీకి చెందిన లస్మన్న ఏడాది క్రితం కొత్త ఇంటిని నిర్మించాడు. భవన నిర్మాణం కోసం టీ ఎస్ బీపాస్ ద్వారా మున్సిపల్ నుంచి అనుమతి తీసుకున్నాడు. ఈ సమయంలో ఇంకుడు గుంత కోసం రూ.2,080 చెల్లించాడు.
- పట్టణంలోని టైలర్స్‌కాలనీకి చెందిన శివ ఇటీవల గృహ నిర్మాణాన్ని చేపట్టాడు. మున్సిపల్ నుంచి అనుమతి తీసుకునే సమయంలో ఇంకుడు గుంత కోసం రూ.2069 చెల్లించాడు. అయితే ఇంటి నిర్మాణం పూర్తయినా ఇంకుడు గుంతపై మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. వీరిద్దరే కాదు.. ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో కొత్తగా భవన నిర్మాణాలు చేపట్టిన చాలా మందిది ఇదే పరిస్థితి.

- నిధుల స్వీకరణ సరే.. నిర్మాణాల జాడేది?
- ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని బల్దియా
- నీటి సంరక్షణను మరిచిన అధికారులు
- ఆదిలాబాద్ మున్సిపల్ తీరిది

కైలాస్‌నగర్: నీరు ప్రాణకోటికి జీవనాధారం. ప్రతీ బొట్టును ఒడిసిపట్టాల్సిన ఆవశ్యకత ఎంతో ఉంది. తాగునీరు లభించక ఏటా వేసవిలో ఎంతో మంది జనం అల్లాడుతున్న పరిస్థితులను మనం గమనిస్తూనే ఉంటాం. కిలోమీటర్ల మేర నడిచి వెళ్లి నీటిని తెచ్చుకుంటున్న వాటిని సైతం చూస్తుంటాం. ఇలాంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే నీటిని పొదుపుగా వాడటంతో పాటు వర్షపు నీటిని సంరక్షించుకోవాల్సిన అవసరం ఉంది. ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలను నిర్మించుకోవడం ద్వారా వర్షం నీటిని ఒడిసిపట్టడంతో పాటు వాడుకున్న నీటిని భూమిలోనికి మళ్లించేందుకు ఉపయోగపడుతుంది. దీని అవశ్యకతను గుర్తించిన ప్రభుత్వం ఇంకుడు గుంతల నిర్మాణాలను ప్రోత్సహిస్తోంది. పట్టణాల్లో ఇంటి నిర్మాణాల కోసం అనుమతి తీసుకునే సమయంలోనే వాటి కోసం ప్రత్యేకంగా నిధులను స్వీకరిస్తోంది. అయితే వీటిని వినియోగించి నిర్మాణాలు చేపట్టాల్సిన బల్దియా అలసత్వాన్ని ప్రదర్శిస్తోంది. ప్రజల్లో అవగాహన రాహిత్యం, మున్సిపల్ అధికారుల అలసత్వంతో నీటి సంరక్షణను పట్టించుకోవడం లేదు. ఫలితంగా నీటి వృథా ఆగడం లేదు.

స్క్వేర్‌యార్డ్ ఆధారంగా నిధుల స్వీకరణ

ఇంకుడుగుంతల ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయాలని భావించిన రాష్ట్ర ప్రభుత్వం.. పట్టణ, గ్రామాల్లో కొత్తగా చేపట్టే ఇంటి నిర్మాణాల్లో వాటిని తప్పనిసరి చేసింది. టీఎస్ బీపాస్ ద్వారా భవన నిర్మాణాల కోసం అనుమతి తీసుకునే సమయంలోనే ఆన్‌లైన్‌లో ఇంకుడు గుంత కోసం అధికారులు ఫీజు వసూలు చేస్తున్నారు. స్థల విస్తీర్ణం ఆధారంగా ఇది రూ.2వేల రూ.4వేల వరకు ఉంటుంది. ఇంటి నిర్మాణాలు పూర్తయ్యాక మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో వాటి కోసం టెండర్లు నిర్వహించి సంబంధిత కాంట్రాక్టర్లతో ఇంకుడు గుంతలు తవ్వించాల్సి ఉంటుంది. అయితే ఆదిలాబాద్ మున్సిపాలిటీలో ఇదేమీ జరగడం లేదు. రెండేళ్లుగా నిధులను స్వీకరిస్తున్నారే తప్ప నిర్మాణాలను చేపట్టడం లేదు. ఫలితంగా లక్షలాది రూపాయల నిధులు బల్దియా ఖాతాల్లో మూలుగుతున్నాయి. ఒక్కో భవనానికి రూ.2వేల చొప్పున లెక్కించినా రూ.33లక్షలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. ఉన్నతాధికారులు చొరవ చూపితే తప్ప ప్రభుత్వ లక్ష్యం నేరవేరని పరిస్థితి.

2020 నుంచి జిల్లాలో భవన నిర్మాణాల కోసం అందిన దరఖాస్తుల వివరాలు

గడిచిన మూడేళ్లుగా బల్దియాకు అందిన దరఖాస్తులు : 2,253
అనుమతించినవి : 1,654
తిరస్కరించినవి : 471
పెండింగ్‌లో ఉన్నవి : 128

కొరవడిన ప్రచారం

ఇంకుడు గుంతల నిర్మాణాల మాట అటుంచితే కనీసం వాటిని నిర్మించుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించడంలోనూ అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలున్నాయి. ఈ నిర్మాణాలకు ప్రస్తుత సీజన్ అనువైంది. ఇప్పటి నుంచి జూన్ వరకు నిర్మించవచ్చు. తద్వారా వర్షకాలంలో నీటి సంరక్షణ జరిగి భూగర్భజల మట్టం పెరుగుతంది. ఇప్పటికైనా బల్దియా అధికారులు స్పందించి అవసరమైన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఇంజినీరింగ్ విభాగం ద్వారానే టెండర్లు..

ఇంటి నిర్మాణం కోసం ఆన్‌లైన్‌లో అనుమతి తీసుకునే సమయంలో ఇంటి వద్ద ఇంకుడుగుంత ఉందా అని ఆప్షన్ అడుగుతుంది. లేనిపక్షంలో దానికోసం భవన నిర్మాణ యజమాని డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. ఇలా పోగైన నిధులతో మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం ద్వారా టెండర్లు నిర్వహించి ఎంపిక చేసిన కాంట్రాక్టర్ ద్వారా నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. అయితే ఇంజినీరింగ్ అధికారులు ఇప్పటివరకు మమ్మల్ని ఎలాంటి వివరాలు అడగలేదు.

– సాయికిరణ్, టౌన్ ప్లానింగ్ అధికారి

ఉట్నూర్ ఘటన పునరావృతం కాకుండా చర్యలు



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ రిజ్వాన్

- కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: ఉట్నూర్ ఘటన పునరావృతం కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. పదో తరగతి పరీక్షల నిర్వహణపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి హైదరాబాద్ నుంచి ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, డీఈవోలతో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో పదో తరగతి పరీక్షల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉట్నూర్ ఘటన పునరావృతం కాకుండా జవాబు పత్రాలను తరలించే సమయంలో పోస్టాఫీసు నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లుగా వెల్లడించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, డీఈవో పణీత, ఆర్టీసీ డీఎం కల్పన పాల్గొన్నారు.

కలెక్టర్‌కు రాములోరి కల్యాణ తలంబ్రాలు



కలెక్టర్‌కు రాములోరి తలంబ్రాలను అందజేస్తున్న డీఎం కల్పన

కైలాస్‌నగర్: శ్రీరామ నవమి పురస్కరించుకుని ఆర్టీసీ కార్గో ద్వారా బుక్ చేసుకున్న భద్రాచలం శ్రీరాములోరి కల్యాణ తలంబ్రాలు జిల్లాకు చేరాయి. ఈమేరకు కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను తన చాంబర్‌లో మంగళవారం ఆర్టీసీ డీఎం కల్పన కలిసి వాటిని అందజేశారు. అనంతరం ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి, డీఎస్పీ ఉమేందర్‌కు సైతం తలంబ్రాలను అందజేశారు. ఈ నెల 10 వరకు అవకాశం ఉందని తలంబ్రాలు కావాల్సిన వారు కార్గో కౌంటర్‌లో సంప్రదించి బుక్ చేసుకోవచ్చని డీఎం తెలిపారు.

విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి



మాట్లాడుతున్న సుహాసినిరెడ్డి

ఆదిలాబాద్: వరుస ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనలకు నైతిక బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి రాజీనామా చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఆమె నివాసంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని మండిపడ్డారు. టీఎస్పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ ఘటన మరవకముందే పదోతరగతి ప్రశ్నపత్రాలు సోషల్ మీడియాలో వస్తున్నాయన్నారు. అలాగే సోమవారం జిల్లాలోని ఉట్నూరు మండల కేంద్రంలో పదో తరగతి జవాబు పత్రాలు మాయమవడం పూర్తిగా విద్యాశాఖ నిర్లక్ష్యమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు గటిక క్రాంతికుమార్, వెంకటరెడ్డి, కాంతారావు, లీలావతి, అనసూయ, రాము, ప్రశాంత్, ముఖీమ్ తదితరులు పాల్గొన్నారు.

పుర ప్రజావాణికి 20 అర్జీలు



అర్జీలను స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ శైలజ

కైలాస్‌నగర్: మున్సిపల్ పరిధిలో సమస్యల పరిష్కారం మంగళవారం నిర్వహించిన పుర ప్రజావాణికి స్పందన లభించింది. తమ సమస్యలను చెప్పుకునేందుకు బాధితులు తరలివచ్చారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో కమిషనర్ శైలజ పాల్గొని బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇంటి, నల్లా పన్ను, అసిస్మెంట్, పేరు మార్పిడి, భూ అక్రమణలు, తాగునీటి సరఫరాలో ఇబ్బంది, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడం వంటి సమస్యలపై ఈ వారం మొత్తం 20అర్జీలు అందాయి. ఇందులో రెవెన్యూ విభాగానికి సంబంధించినవే 15 ఉండడం గమనార్హం. వాటిని పరిశీలించిన అనంతరం కమిషనర్ సంబంధిత విభాగాల అధికారులకు వాటిని అందజేస్తూ సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. భూ సంబంధిత సమస్యలను గ్రీవెన్స్‌లో స్వీకరించబోమని ఆమె స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ దివాకర్, డీఈలు తిరుపతి, యూనుస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె

- వీవోఏ ఉద్యోగుల సంఘం స్పష్టం



డీఆర్డీవోకు సమ్మె నోటీస్ అందజేస్తున్న వీవోఏలు

కైలాస్‌నగర్: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని లేని పక్షంలో నిరవధిక సమ్మెకు దిగుతామని ఐకేపీ వీవోఏల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు టి.లక్ష్మణచారి, దర్శనాల అరుణ్ అన్నారు. సంఘం ఆధ్వర్యంలో డీఆర్డీవో కిషన్‌కు మంగళవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామస్థాయిలో మహిళా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేస్తూ వారి అభ్యున్నతికి పాటు పడుతున్నామన్నారు. అలాగే ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలన్నింటినీ విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రం వచ్చి ఎనిమిదేళ్లు దాటినా వీవోఏల బతుకులు మాత్రం మారలేదన్నారు. వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సమస్యలను ఈ నెల 16లోగా పరిష్కరించాలని లేనిపక్షంలో 17 నుంచి నిరవధికంగా సమ్మెకు దిగుతామని స్పష్టం చేశారు. అప్పటి వరకు ఆన్‌లైన్ పనులు నిలిపివేస్తున్నట్లుగా ప్రకటించారు. కార్యక్రమంలో సంఘ బాధ్యులు రమేశ్, లస్మన్న తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం'

ఇంద్రవెల్లి: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం ఆడుతుందని ఆదివాసీ మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందోర్ పుష్పరాణి అన్నారు. మండలకేంద్రంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. పదో తరగతి పరీక్షల్లో భాగంగా తొలిరోజు తెలుగు, రెండో రోజు హిందీ పేపర్ లీక్ కావడంపై రాష్ట్ర ప్ర భుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. అలాగే ఉట్నూర్‌లో సోమవారం జవాబు ప త్రాల బండిల్ మిస్ అయిందన్నారు. విద్యార్థులు ఎంతో కష్టపడి పరీక్షలకు సిద్ధమవుతుండగా పేపర్ లీక్‌లు, జవాబు పత్రాల మిస్సింగ్‌పై వారు ఆందోళన చెందుతున్నారన్నారు. ఈ వి ష యంలో విద్యాశాఖ మంత్రిని వెంటనే భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆది వాసీ, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు భరత్, చిత్రు, నాగోరావ్, భరత్, పృథ్వీరాజ్ తదితరులున్నారు.

ప్రేమ.. దారి తప్పుతోంది



- ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నాలుగేళ్ల క్రితం ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో చదువుతున్న ఓ అమ్మాయికి తన క్లాస్‌మెట్‌తో పరిచయం ఏర్పడింది. అది కాస్త ప్రేమగా మారింది. అమ్మాయికి ఇంట్లో పెళ్లి సంబంధం చూశారు. ఎంగేజ్‌మెంట్ కూడా అయ్యింది. అయితే ఇది జరిగిన రెండు రోజులకే తాను ప్రేమించిన అబ్బాయితో వెళ్లిపోయి పెళ్లి చేసుకుంది. దీంతో తల్లిదండ్రులు వారిని ఇంటికి రానివ్వలేదు. కొద్దిరోజుల తరువాత వారికి ఓ పాప పుట్టింది. కుటుంబపోషణ భారంగా మారింది. భర్త మద్యానికి బానిసయ్యాడు. బాధ్యతలు ఆమెనే చూసి.. చివరకు కొన్నేళ్లకు భర్తను వదిలి తల్లిదండ్రుల చెంతకు చేరింది.
- బోథ్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన దంపతులకు ఇద్దరు కూతుళ్లు. రెండేళ్లక్రితం పెద్దమ్మాయి 18 ఏళ్లు కూడా నిండకముందే అదే గ్రామానికి చెందిన అబ్బాయితో ప్రేమలో పడింది. తల్లిదండ్రులను ఎదురించి పెళ్లి కూడా చేసుకుంది. ఆరు నెలలు తిరగకుండానే భార్యాభర్తల మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. దీంతో ఆమె తల్లిదండ్రుల చెంతకు చేరింది. పెద్దల సమక్షంలో విడాకులు తీసుకుంది. ఇలా చాలా మంది మంచీచెడు తెలియని వయసులో ప్రేమలోపడి వారి జీవితాలను ఛిన్నాభిన్నం చేసుకుంటున్నారు.

- ఆకర్షణను ప్రేమ అనుకుంటూ. యువత తప్పటడుగు
- వాట్సాప్, ఫేస్‌బుక్‌ల ప్రభావం
- అర్ధరాత్రి వరకూ చాటింగ్‌లు
- ఛిన్నాభిన్నమవుతున్న జీవితాలు

బోథ్: యుక్త వయస్సు రాగానే 'మేం పెద్ద వాళ్లమయ్యాం' అనే భావన.. ఇక ప్రేమ మొదలు పెట్టవచ్చు అనే అభిప్రాయం యువతలో నానాటికి పెరిగిపోతోంది. ఏది ప్రేమో..? ఏది ఆకర్షణో..? తెలియక చిన్న వయసులోనే తప్పటడుగులు వేస్తున్నారు. పరిపక్వత లేని ఆలోచనలు, మంచీచెడుల విచక్షణలేమి, వయసును పరుగు తీయించే విదేశీ సంస్కృతి.. చిన్న వయస్సులోనే వారిని పెడదోవ పట్టిస్తోంది. కొంతమంది అమ్మాయిలు ఆకర్షణలో పడి తమ ఉజ్వల భవిష్యత్‌ను దూరం చేసుకుంటున్నారు. మోసగాళ్లను నమ్మి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఎవరితో ఎలా మెదలాలి..? ఎవరితో స్నేహం చేయాలి..? అనే విషయాలు ఆలోచించకుండా ముందడుగు వేయడంతో చివరకు వారి జీవితంలో చీకట్లు అలుముకుంటున్నాయి.

ప్రేమ..నేటి సమాజంలో సర్వసాధారణమయింది. తల్లిదండ్రులు తమ పిల్లలను పట్టించుకోక పోవడం, టీవీ, సెల్‌ఫోన్, వాట్సాప్, ఫేస్‌బుక్‌లు యువతపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. చిన్న వయసులోనే ప్రేమపేరుతో పెద్దలను ఎదురించడం, ఇంటి నుంచి వెళ్లిపోయి పెళ్లిళ్లు చేసుకోవడం వంటివి చోటు చేసుకుంటున్నాయి. ఇదే సమయంలో ప్రేమజంటల ఆత్మహత్యలు, ప్రేమికుడి ఘాతుకం, పలాయనం వంటి వార్తలు నిత్యం వినిపిస్తున్నాయి. మంచి, చెడు ఏమీ తెలియని వయసులో వారు తీసుకునే నిర్ణయాదులు తల్లిదండ్రులకు శోకం మిగులుస్తున్నాయి. వీటిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వ్యసనంగా వాట్సాప్.. అర్ధరాత్రి వరకు చాటింగ్

ఎదుటివారు ఎవరు..? ఎలా ఉంటారు..? గుణగణాలు ఏమిటి..? అనే విషయాలను పూర్తిస్థాయిలో తెలుసుకోకుండానే చాటింగ్ చేస్తున్నారు. దీనివల్ల అమ్మాయిలు వెంటనే ప్రేమలోకి జారుతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకునే కొందరు వారిని మోసం చేస్తున్నారు. సినిమాల ప్రభావం కూడా యువతపై చాలా ఉంది. పరిపక్వత లేని వయసులో వారే హీరోగా, హీరోయిన్‌గా ఊహించుకుంటూ ప్రేమ మాయలో పడిపోతున్నారు. ప్రస్తుతం యువతకు సెల్‌ఫోన్లు అత్యంత ప్రమాదకరంగా మారాయి. వాట్సాప్ మెసేజ్‌లు చాలావరకు ప్రేమకు ఆజ్యం పోస్తున్నాయి. చివరకు అవే వారి జీవితాలను అల్లకల్లోలం చేస్తున్నాయి. రోజు మొత్తం వాట్సాప్‌తోనే యువత కాలక్షేపం చేస్తోంది. అర్ధరాత్రివరకు చాటింగ్ చేస్తున్నారు. దిండుపక్కనే ఫోన్ పెట్టుకుని ప్రతి నిమిషానికీ సమాధానాలు ఇస్తు న్నారంటే వారు మొబైల్‌కు ఎంత బానిసయ్యారో అర్థం చేసుకోవచ్చు.

అష్టకష్టాలు పడుతూ..

పెద్దలను ఎదురించి ప్రేమ పెళ్లి చేసుకున్న చాలా మంది ప్రస్తుతం ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. పెళ్లి చేసుకుని తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ సాగుతున్న సంసారంలో ఆర్థిక అంశాలు వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. అబ్బాయి ఏం చేస్తాడు..? ఎలా పోషిస్తాడు..? కూడా తెలుసుకోకుండా పెళ్లి చేసుకుని.. తీరా కుటుంబ పోషణ భారమై చివరికి తల్లిదండ్రుల వద్దకే వస్తున్న ఘటనలు చాలానే ఉన్నాయి. చిన్న వయసులోనే పెళ్లిల్లు చేసుకుని భార్యాభర్తల మధ్య గొడవలు ప్రారంభమై, విడాకులు తీసుకున్న వారూ అనేకం ఉన్నారు.

క్షణికావేశంలో నిర్ణయాలతోనే..



చాలా మంది టీనేజర్స్ క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకుంటున్నారు. వారు ఒక్క క్షణం కుటుంబం, భవిష్యత్ గురించి ఆలోచించాలి. ఏది నిజం.. ఏది అబద్ధం.. మనం చేస్తున్నది కరెక్టేనా అని ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. అనాలోచిత నిర్ణయాలు అనర్థాలకు దారితీస్తాయి. తల్లిదండ్రులు మన గురించే ఆలోచిస్తారు అనే విషయాన్ని యువత గుర్తించాలి. పెద్దల మాటకు విలువనిస్తే భవిష్యత్ సైతం బాగుంటుంది.


– ఓం ప్రకాశ్, మానసిక వైద్య నిపుణులు

తల్లిదండ్రులు గమనిస్తుండాలి

తమ పిల్లలు ఏం చేస్తున్నారో తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. మంచీచెడులను వివరించాలి. వారి లక్ష్యాలను గుర్తు చేస్తూ నెరవేర్చుకునేలా ప్రోత్సహించాలి. ముఖ్యంగా వాట్సాప్, ఫేస్‌బుక్ వంటివి అవసరమున్న వరకే వాడాలని సూచించాలి. టీనేజ్ పిల్లలు, యువతకు ఆయా మండలాల్లో కౌన్సెలింగ్ ఏర్పాటు చేస్తున్నాం. కళాశాలల్లో సైతం ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– ఉమేందర్, డీఎస్పీ, ఆదిలాబాద్

కేజీబీవీలో ఎంసెట్ కోచింగ్



ఆదిలాబాద్‌టౌన్: కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయాల్లో చదివేది పేద విద్యార్థినిలే. బాలికల చదువును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇంటర్ పూర్తి చేసిన తర్వాత ఉన్నత విద్య చదవాలనే ఉద్దేశంతో ఉచితంగా ఎంసెట్ శిక్షణ తరగతులు నిర్వహిస్తోంది. ఇటీవల ఇంటర్ పరీక్షలు ముగియడంతో విద్యార్థినిలు ఇంటిబాట పట్టారు. ఖాళీగా ఉండకుండా జూమ్ యాప్ ద్వారా వారికి ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ తరగతులను బోధిస్తున్నారు. గతంలో కూడా కేజీబీవీల్లో చదివిన విద్యార్థినులు ఇంజనీరింగ్, నర్సింగ్ తదితర కోర్సుల్లో సీట్లు సాధించారు. లక్షల రూపాయలు వెచ్చించి శిక్షణ పొందలేని విద్యార్థినులకు ఈ శిక్షణ వరంగా మారనుంది.



కేజీబీవీలో చదువుతున్న విద్యార్థినులు (ఫైల్)

- జూమ్ ద్వారా ప్రత్యేక శిక్షణ
- బాలికల విద్యను ప్రోత్సహించేందుకు కసరత్తు
- గతేడాది పలువురికి ఎంసెట్, నర్సింగ్ సీట్లు

జిల్లా	ఇంటర్ కేజీబీవీలు	విద్యార్థుల సంఖ్య
ఆదిలాబాద్	09	161
నిర్మల్	06	94
మంచిర్యాల	05	87
ఆసిఫాబాద్	06	77

జూమ్ యాప్ ద్వారా ప్రత్యేక శిక్షణ..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 26 ఇంటర్మీడియేట్ కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీ) ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు విద్యాబోధన చేస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో 161 మంది విద్యార్థినిలు ఎంసెట్ పరీక్ష రాయనుండగా 14 మంది విద్యార్థినిలు బీఎస్సీ నర్సింగ్ కోసం దరఖాస్తులు చేసుకున్నారు. హాజరు శాతం మాత్రం తక్కువగా ఉంది. 50 మంది విద్యార్థులు ఈ శిక్షణకు హాజరవుతున్నారు. నిర్మల్‌లో 94 మంది ఎంసెట్ శిక్షణకు దరఖాస్తు చేసుకోగా హాజరుశాతం మెరుగ్గానే ఉంది. కుమురంభీం ఆసిఫాబాద్‌లో 77మంది నమోదు చేసుకోగా 50మంది మాత్రమే శిక్షణ పొందుతున్నారు. మంచిర్యాల జిల్లాలో 87 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 60మంది వరకు తరగతులను వీక్షిస్తున్నారు. వీరికి ఉదయం 6.30 నుంచి 11 గంటల వరకు, రాత్రి 7 నుంచి 8గంటల వరకు జూమ్ యాప్‌లో తరగతులు బోధిస్తున్నారు. సాయంత్రం 5 నుంచి 6.30 గంటల వరకు సందేహాలను నివృత్తి చేసేందుకు కేజీ బీవీ పీజీ సీఆర్టీలను ప్రత్యేకంగా నియమించారు. సందేహాల నివృత్తికి వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశారు.

35 రోజుల పాటు శిక్షణ..

ఎంసెట్ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థినిలకు 35 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. రోజుకు సబ్జెక్టుకు సంబంధించి 40చొప్పున బిట్స్ చెబుతున్నారు. వీటిలో 20బిట్స్ బోధిస్తుండగా, 20 బిట్లను ప్రాక్టీస్ కోసం వాట్సాప్ గ్రూప్‌లో పంపుతున్నారు. ప్రతి విద్యార్థికి ప్రత్యేక ఐడి కేటాయించారు. కొన్ని సాంకేతిక కారణాలతో విద్యార్థులు శిక్షణకు హాజరు కాలేకపోతుండగా మరికొంతమంది విద్యార్థినిలు స్మార్ట్ ఫోన్‌లు లేక శిక్షణకు దూరమవుతున్నారు. గతేడాది నేరడిగొండ కేజీబీవీకి చెందిన ముగ్గురు విద్యార్థినిలు బీఎస్సీ నర్సింగ్ సీట్లు సాధించారు. బోథ్‌కు చెందిన ఓ విద్యార్థిని హైదరాబాద్‌లోని ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలలో సీటు సాధించింది.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం కల్పిస్తున్న ఎంసెట్ శిక్షణ తరగతులను కేజీబీవీ విద్యార్థినిలు సద్వినియోగం చేసుకోవాలి. ఆదిలాబాద్ జిల్లాలో 161 మంది విద్యార్థినిలు ఎంసెట్ కోసం, 14మంది విద్యార్థినిలు బీఎస్సీ నర్సింగ్ శిక్షణ కోసం దరఖాస్తులు చేసుకున్నారు. వీరికి జూమ్ యాప్ ద్వారా తరగతులు బోధించడం జరుగుతుంది. విద్యార్థినుల హాజరు తక్కువగా ఉంటుంది. తల్లిదండ్రులు ప్రోత్సహించి శిక్షణ తరగతులకు హాజరయ్యేలా చూడాలి. ఏవైన సందేహాలు ఉంటే నివృత్తి చేసేందుకు పీజీ సీఆర్టీలను నియమించాం.

– ఉదయశ్రీ, కేజీబీవీ సెక్టోరల్ అధికారి

గంటలో 3.54లక్షల మొక్కలు.. లిమ్కాబుక్‌లో చోటు

- ఎమ్మెల్యే రామన్నకు ప్రశంసా పత్రం అందజేసిన సీఎం కేసీఆర్



ఎమ్మెల్యేకు ధృవపత్రం అందిస్తున్న సీఎం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న పుట్టిన రోజును పురస్కరించుకుని 2021 జూలై 4న స్థానిక దుర్గానగర్‌లో మొక్కలు నాటిన కార్యక్రమానికి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కింది. గ్రీన్ ఇండియా చాలెంజ్ సృష్టికర్త, రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్‌కు చోటు లభించింది. గంటలో అత్యధిక మొక్కలు నాటించే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టినందుకు చోటు కల్పించినట్లు లిమ్కాబుక్ రికార్డ్స్ ఎడిటర్ వత్సాల కౌల్ బెనర్జీ తెలిపారు. లిమ్కా బుక్ ప్రశంస పత్రాన్ని సీఎం కేసీఆర్ సంతోష్‌కుమార్‌తో పాటు ఎమ్మెల్యే జోగు రామన్న మంగళవారం ప్రగతిభవన్‌లో అందుకున్నారు. గ్రీన్‌ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా సంతోష్ కుమార్ చొరవతో ఒక గంట వ్యవధిలో 16,900 వందల మంది భాగస్వామ్యంతో 3,54,900 మొక్కలు నాటారు. కార్యక్రమంలో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ప్రతినిధి సంజీవ రాఘవ, బీఆర్ఎస్ యువ నాయకులు జోగు మహేందర్, స్వాస్ సంస్థ అధ్యక్షులు కారింగుల ప్రణయ్ పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో పలువురికి జరిమానా

నిర్మల్‌టౌన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 22 మందికి జరిమానా విధిస్తూ నిర్మల్ న్యాయస్థానం తీర్పించినట్లు పట్టణ ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, దేవేందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలో మంగళవారం వాహనాలు తనిఖీ చేపట్టారు. 22 మంది పట్టుబడగా వారిని కోర్టులో హాజరు పరిచారు. వారికి రూ.25100 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు.

క్లుప్తంగా

108లో ప్రసవం



108లో ప్రసవించిన సుబ్బమ్మ

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామానికి చెందిన సుబ్బమ్మ తొమ్మిది నెలల గర్భవతి. మంగళవారం పురిటినొప్పులు రావడంతో కుటుంబీకులు 108కు సమాచారం ఇచ్చారు. భైంసా ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో నొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ పూజారి లక్ష్మణ్, పైలెట్ ఖాజామోయినోద్దీలు ప్రసవం చేశారు. 108లో ఆడ శిశువుకు జన్మనిచ్చింది. తల్లిబిడ్డలు క్షేమంగా ఉన్నట్లు సిబ్బంది పేర్కొన్నారు..

బజార్‌హత్నూర్: మండలంలోని మహదేవ్ నగర్‌కు చెందిన కోమలబాయికి మంగళవారం ఉదయం పురుటినొప్పులొచ్చాయి. స్థానికులు 108 హెల్ప్‌లైన్ నంబర్‌కు సమాచారమిచ్చారు. దీంతో బజార్‌హత్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్స్ ఈఎంటీ గోపీ, పైలట్ శ్రీనివాస్ ఫోన్‌లో ఈఆర్‌సీపీ డాక్టర్ మహిత్ ఆన్‌కాల్ ద్వారా సలహాలు తీసుకుని ప్రసవం చేశారు. దీంతో మగబిడ్డను ప్రసవించింది. తల్లి, బిడ్డను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

ఆవు, లేగదూడను తరలిస్తున్న ట్రాలీ పట్టివేత



పోలీసులు పట్టుకున్న ట్రాలీఆటో

తాంసి: జిల్లా కేంద్రంలోని గోవధశాలకు అక్రమంగా ఆవు, లేగదూడను తరలిస్తున్న ఆటో ట్రాలీని పట్టుకున్నట్లు ఎస్సై లాల్‌సింగ్ నాయక్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం ... మండలంలోని సుంకిడి గ్రామం నుంచి జిల్లా కేంద్రంలోని గోవధశాలకు ఆవు, లేగదూడను ఆటోట్రాలీలో తరలిస్తున్నారు. పక్కా సమాచారం మేరకు ఆవు లేగదూడను తరలిస్తున్న ట్రాలీని ఎస్సై పొన్నారి గ్రామం వద్ద పట్టుకున్నారు. అక్రమంగా తరలిస్తున్న షేక్ కలీం, షేక్ ఉబాయిద్‌లు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

భైంసాటౌన్: తానూర్ మండలం మహాలింగి గ్రామానికి చెందిన కాప్రె గంగాధర్(32) ఈ నెల ఒకటో తేదీన అదృశ్యమయ్యాడు. మంగళవారం భైంసాలో మృతిచెంది కనిపించాడు. భోకర్ రోడ్డులోని నర్సరీ వెనుక కుళ్లినస్థితిలో మృతదేహం కనిపించడంతో సమాచారమందుకున్న పోలీసులు చేరుకుని పరిశీలించారు. మృతదేహం సమీపంలో పురుగుల మందు డబ్బా ఉండడంతో ఆత్మహత్యగా భావిస్తున్నారు. కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియాస్పత్రికి తరలించారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు.

ప్రాణం తీసిన అదనపు కట్నం

- పురుగులమందు తాగిన బాలింత
- రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి
- గత నెల 6వ తేదీన మగబిడ్డ జననం
- ఆస్పత్రి ఎదుట కుటుంబీకుల నిరసన
- అత్తింటివారిని అరెస్ట్ చేయాలని డిమాండ్



ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబీకులు



ఐశ్వర్య (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: నవమాసాలు మోసి మగబిడ్డకు జన్మనిచ్చిన ఓ తల్లి వరకట్న వేధింపులకు బలైంది. దీంతో కుటుంబీకులు రిమ్స్ ఆవరణలో ఆందోళనకు దిగారు. మృతురాలి భర్తతో పాటు అత్తింటి వారిని అరెస్టు చేయాలని డిమాండ్‌చేశారు. దీంతో రిమ్స్‌లో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కుటుంబీకుల వివరాల ప్రకారం.. నార్నూర్ మండలం సుంగాపూర్‌కు చెందిన ఐశ్వర్య (20) ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీలో నివాసముంటున్న బండారి మహేష్‌తో 2022 ఫిబ్రవరి 3న వివాహం చేశారు. మహేష్ ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని యాపల్‌గూడ 32వ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. వివాహ సమయంలో రూ.22 లక్షల కట్నం ఒప్పుకున్నారు. పెళ్లి సమయానికి రూ.10 లక్షలు ఇచ్చారు. ఐశ్వర్య గర్భం దాల్చిన తర్వాత ప్రసవం కోసం పుట్టింటికి వచ్చింది. గత నెల 6వ తేదీన మగబిడ్డకు జన్మనిచ్చింది. అప్పటి నుంచి రూ.22లక్షల కట్నం తీసుకుని రావాలని నిత్యం ఫోన్‌లో వేధింపులకు గురిచేసేవాడు. గతంలోనూ ఈ విషయమై ఐశ్వర్య తల్లిదండ్రులు మహేశ్ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అయినా వేధింపులు ఆగలేదు. మనస్తాపానికి గురైన ఐశ్వర్య సోమవారం పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందింది. దీంతో కుటుంబీకులు మహేశ్‌ను అరెస్టు చేసి ఉద్యోగం నుంచి సస్పెండ్ చేయాలని ఆందోళనకు దిగారు. పోలీసులు సముదాయించేందుకు ప్రయత్నించినా ససేమిరా అన్నారు. దీంతో పోలీసులు ఆందోళనకారుల మధ్య కొంతసేపు వాగ్వివాదం చోటుచేసుకుంది. అనంతరం టూటౌన్ సీఐ పురుషోత్తం చేరుకుని భరోసా కల్పించడంతో ఆందోళన విరమించారు.

ఇద్దరు దొంగలు అరెస్టు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్‌లోని పలు ఇళ్లల్లో చోరీకి పాల్పడిన ఇరువురిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ మల్లేశ్ తెలిపారు. సీఐ వివరాల ప్రకారం... నిజామాబాద్ జిల్లా ధర్మారం గ్రామానికి చెందిన అబుహాజీ ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్‌లో అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. గత జనవరి నెలలో స్థానిక ఆజాద్‌కాలనీలోని ఓ ఇంట్లో, ఫిబ్రవరిలో అదే కాలనీలోని మరో ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. మరో నేరస్తుడైన మహ్మద్ అస్లామ్‌బిన్ సైతం అదే కాలనీలో దొంగతనానికి పాల్పడినట్లు పోలీసుల విచారణలో ఒప్పుకున్నారు. వీరు జిల్లా కేంద్రంలోని మంచిర్యాల చౌరస్తాలో పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా ఎస్సై రమణారావుకు పట్టుబడ్డారు. అయితే అబుహాజీపై డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో బాలికను ఎత్తుకెళ్లగా కేసు నమోదైంది. ఇరువురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టర్ల కార్యవర్గం ఎన్నిక



బాబాగౌడ్



దుర్గం శేఖర్



మల్లేశ్

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టర్ల యూనియన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని దుర్గం సొసైటీ కార్యాలయంలో సమావేశమైన నాలుగు జిల్లాల పరిధిలోని కాంట్రాక్టర్లు తమ సమస్యలపై చర్చించి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా గురునాథం బాబాగౌడ్, అధ్యక్షుడిగా దుర్గం శేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మండల భాస్కర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా భూపెల్లి మల్లేష్, ముఖ్య సలహాదారుగా రత్నం శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా మహావీర్, రుక్మారెడ్డి, సునీల్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాజశేఖర్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీగా మురళి, కోశాధికారిగా ఎన్. దేవరాజ్, కార్యవర్గ సభ్యులుగా తోట పాపేష్, ఏ.రజిత బి. దేవేందర్ డి.శ్యాం కుమార్‌ను ఎన్నుకున్నట్లుగా జిల్లా అధ్యక్షుడు శేఖర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- మరొకరికి గాయాలు



గాయాల పాలైన పట్వారి సీతారాం




రాథోడ్ లచ్చిరాం నాయక్ (ఫైల్)

నేరడిగొండ: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందిన సంఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన రాథోడ్ లచ్చి రాంనాయక్ (57) నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం రాజాపూర్ గ్రామానికి చెందిన పట్వారి సీతారాంతో కలిసి స్కూటీపై ఇచ్చోడకు వెళ్లి తిరిగి వస్తుండగా కుప్టి వంతెనపై గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో లచ్చి రాం నాయక్ అక్కడికక్కడే మృతిచెందాడు. పట్వారి సీతారాం కాలు విరిగింది. లచ్చిరాం నాయక్ నేరడిగొండ లంబాడీ నాయక్‌గా వ్యవహరిస్తున్నారు. కాగా గాయాల పాలైన సీతారాంను ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

గోదారంగనాథుల కల్యాణం





కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

మామడ: మండలంలోని పొన్కల్ శ్రీలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయంలోని బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం గోదాదేవిరంగనాథుల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఆలయం నుంచి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా భక్తులు వేంకటేశ్వరస్వామి శోభాయాత్రను నిర్వహించారు. అలాగే ఆలయంలోని ఉత్సవ విగ్రహాలతో ఎదుర్కోలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు. ఈ నెల 6వ తేదీన రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. టీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీహరిరావు, పీఏసీఎస్ ఛైర్మన్ హరీష్‌కుమార్ పూజలు చేశారు.

బంధుత్వాలు తెలిపే 'బలగం'



తలమడుగులో బలగం సినిమాను తిలకిస్తున్న గ్రామస్తులు



బోథ్‌లో..



నేరడిగొండ: తేజాపూర్‌లో చిత్ర ప్రదర్శన

తలమడుగు: తలమడుగు మండల కేంద్రంలో బీజేపీ గిరిజన మోర్చా అధికార ప్రతినిధి సాకటి దశరథ్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి బలగం సినిమాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలకు గత అనుభవాలను గుర్తు చేసే మనుషులను తట్టి లేపే సినిమా బలగం అన్నారు. అలాంటి సినిమాను ప్రజలందరూ తిలకించాలని ఉద్దేశంతో గ్రామంలో ప్రదర్శించినట్లు వివరించారు. పలువురు సినిమా చూసి తమ ఆత్మీయులను తలుచుకుని దుఃఖ సాగరంలో మునిగిపోయారు. మరిచిపోతున్న బంధాలను గుర్తుచేసే విధంగా తమకు మంచి సినిమా చూపెట్టిన దశరథ్‌ను గ్రామస్తులు అభినందించారు.

బోథ్, కౌఠలో..

బోథ్: బోథ్ మండల కేంద్రంలో హనుమాన్ కాలనీలో బలగం సినిమా ప్రదర్శన సోమవారం రాత్రి ఏర్పాటు చేశారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో సినిమాను తిలకించారు. బంధుత్వం, ప్రేమ, కుటుంబసభ్యుల మధ్య ఆప్యాయతతో కూడిన సినిమా బలగమని సర్పంచ్ సురేందర్, విడిసి అధ్యక్షుడు గంగాధర్ పేర్కొన్నారు. అలాగే కౌఠ గ్రామంలో మంగళవారం ప్రదర్శించారు. సినిమా చూసిన అనంతరం పలువురు కన్నీటి పర్యంతమయ్యారు.

తేజాపూర్‌లో...

నేరడిగొండ: మండలంలోని తేజాపూర్ గ్రామంలో మంగళవారం రాత్రి బలగం సినిమా ప్రదర్శన చేపట్టారు. దీంతో గ్రామస్తులందరు చిత్ర ప్రదర్శనను తిలకించారు. తెలంగాణ పల్లెలో కుటుంబాలు ఏవిధంగా ఉండాలో కళ్లకు కట్టినట్లుగా చూపెట్టడంతో అందరు ఆసక్తిగా తిలకించారు. ఈ సినిమా లాగే కుటుంబ బాంధవ్యాలు ఉండాలని చర్చించుకున్నారు.

భానుడి భగభగ



స్కూటీపై ఇలా..



మధ్యాహ్నం నిర్మానుష్యంగా రిమ్స్ ఎదుట రోడ్డు



మాస్కు ధరించి చిన్నారిని తీసుకెళ్తున్న తల్లి

మార్చి మొదటి వారంలోనే ఎండల తీవ్రత భగ్గుమంటోంది. పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతున్నాయి. దీంతో భానుడు భగభగ మండుతున్నాడు. ఉదయం 11 గంటలైతే చాలు జనం ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లేవారు, పాఠశాలల నుంచి ఇంటికి వెళ్లే విద్యార్థులు స్కార్ఫ్‌లు, దుప్పట్లు, గొడుగుల సాయంతో వెళ్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

సారు.... ఇదేం తీరు!



నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కిందిస్థాయి ఉద్యోగులతో అధికారులు వారి సొంత పనులు చేయించుకుంటున్నారు. మంగళవారం బల్దియాలో ఇటీవల ఓ అధికారి కారును కొనుగోలు చేయగా దానిని బల్దియా ఉద్యోగి కడిగి శుభ్రం చేశాడు. బల్దియాకు వచ్చిన పట్టణవాసులు దానిని చూసి పెదవి విరిచారు.

క్లుప్తంగా

కార్మికులకు సెలవు ప్రకటించాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీఎమ్మార్పీఎస్ నాయకులు

కైలాస్‌నగర్: మున్సిపల్ కార్మికులకు ఈనెల 5న సెలవు ప్రకటించి బాబూ జగ్జీవన్ రాం జయంతి ఉత్సవంలో పాల్గొనే అవకాశం కల్పించాలని టీఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. మంగళవారం ఆ సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ శైలజకు వినతిపత్రం అందజేశారు. కార్మికుల్లో ఎక్కువ మంది దళిత సామాజిక వర్గానికి చెందినవారే ఉన్నందున వారికి సెలవు ప్రకటించాలని కమిషనర్‌ను కోరారు. ఆమె స్పందించి.. కార్మికులకు సెలవు ఇవ్వాలని అక్కడే ఉన్న ఎస్ఐ, డీఈలను ఆదేశించారు. సంఘం అధ్యక్షుడు మల్యాల మనోజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి నక్క రాందాస్, జాతీయ ప్రధాన కార్యదర్శి మోతె బారిక్ రావు, జిల్లా కోశాధికారి లింగంపల్లి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

బుద్ధుని బోధనలు అనుసరణీయం



అంబేద్కర్ జయంతి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న అనిల్‌జాదవ్

ఇచ్చోడ: బుద్ధుని బోధనలు, ఆచరణలు అందరికి అనుసరణీయమని నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్‌జాదవ్ అన్నారు. మండలంలోని జామిడిలో బౌద్ధవిహార్‌లో అంబేద్కర్ జయంతి ఉత్సవాల పోస్టర్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో బౌద్ధవిహార్ నిర్మించుకుని ప్రతిరోజు ఉదయం, సాయంత్రం బుద్ధుని గ్రంథాలను పఠనం చేయడం గ్రామస్తుల ఐక్యతకు నిదర్శనమన్నారు. జామిడి సర్పంచ్ హరన్ సుభాష్‌పటేల్, బీఆర్ఎస్ నాయకులు నర్వడే రమేశ్‌తోపాటు ధమ్మకాంత్రి బుద్ధ విహార్ సమితి, భీంటైగర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ పల్లకీ ఊరేగింపు



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

తాంసి: మండలంలోని భీమ్‌గూడ గ్రామంలో మంగళవారం భక్తులు భక్తిశ్రద్ధలతో హనుమాన్ పల్లకీ ఊరేగింపు నిర్వహించారు. పల్లకీలో ఉత్సవ విగ్రహాన్ని ఉంచి గ్రామ ప్రధాన వీధుల గుండా భజనలు చేస్తూ ఊరేగింపు చేపట్టారు. మహిళలు మంగళహారతులతో పాల్గొని పూజలు చేశారు. సర్పంచ్ సంభు ఉన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



బహుమతులు ప్రదానం చేస్తున్న జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి తదితరులు

తలమడుగు: క్రీడలలో గెలుపోటములు సహజమని జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని కజ్జర్ల గ్రామంలో జైభీమ్ యువజన సంఘం ఆధ్వర్యంలో స్వర్గీయ చింతలపెల్లి రామకృష్ణారెడ్డి, జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ పోటీల ముగింపు సందర్భంగా మంగళవారం బహుమతులు ప్రదానం చేశారు. గుడిహత్నూర్ జట్టుకు ప్రథమ బహుమతి రూ. 30 వేలను జెడ్పీటీసీ అందించారు. ద్వితీయ బహుమతి రూ.15 వేలను రామాయి గ్రామ జట్టుకు కజ్జర్ల గ్రామపెద్ద చింతలపెల్లి దేవారెడ్డి అందించారు. సర్పంచ్ వెంకటమ్మ కిరణ్ కుమార్, ఎంపీటీసీలు, ఉడుగు కమలాకర్, వెంకన్న యాదవ్, సి.రమేశ్‌రెడ్డి, గణేశ్ మహరాజ్, కీపర్ గంగన్న, పోశెట్టి, యువజన సంఘ సభ్యులు తదితరలు పాల్గొన్నారు.

రోడ్డు పనులు త్వరగా పూర్తిచేయాలి

బోథ్: బోథ్ నుంచి నిగిని గ్రామం వరకు రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా కార్యదర్శి మహమ్మద్ షేక్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రోడ్డు నిర్మాణం ఆగిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. కంద్రి వాగు వద్ద నూతన వంతెన నిర్మించాలని కోరారు. జిల్లా అధికారులు రోడ్డు పనులు త్వరగా చేపట్టి పూర్తిచేయాలని కోరారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటయ్యేనా?

- బోథ్‌లో ఏళ్లుగా విద్యార్థుల ఎదురుచూపు
- ఉన్నత చదువు కోసం ఇతర ప్రాంతాలకు వెళ్తూ..
- దూరభారంతో ఇక్కట్లు

బోథ్: నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం గతకొన్ని దశాబ్దాలుగా డిమాండ్ ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడు మంజూరు చేస్తుందోనని విద్యార్థులు ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. నియోజకవర్గంలో బోథ్, బజార్‌హత్నూర్, ఇచ్చోడ, నేరడిగొండ, సిరికొండ, గుడిహత్నూర్, తాంసి, తలమడుగు, భీంపూర్‌ను కలిపి 9 మండలాలు ఉన్నాయి. మండలాల్లో మొత్తం ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో దాదాపు 3 వేల మంది విద్యార్థులు ఇంటర్ విద్యనభ్యసిస్తున్నారు. ఆ తర్వాత ఉన్నత చదువుల కోసం ఆదిలాబాద్, నిర్మల్, ఉట్నూర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు వెళ్తున్నారు. కొందరు దూరభారంతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఆర్థిక పరిస్థితి బాగోలేక చాలామంది చదువుకు దూరమవుతున్నారు. ఎన్నికల సమయంలో ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు కళాశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి నిలబెట్టుకోలేదని పలువురు పేర్కొంటున్నారు.

ఇతర ప్రాంతాలకు వెళ్తూ..

నియోజకవర్గంలో విద్యార్థులు ఇంటర్ తర్వాత డిగ్రీ కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. కొందరు దూరభారం, మరికొందరు ఆర్థిక భారంతో చదువును మధ్యలో ఆపేస్తున్నారు. ఉన్నత చదవాలనే వారి కల నెరవేరడం లేదు. విద్యార్థుల బాధను, బోథ్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటుపై ఇటీవల జరిగిన శాసనసభలో బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ ప్రస్తావించారు. సీఎం కేసీఆర్‌కు వివరించి వినతిపత్రం అందించారు. ఆయన సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



సీఎం కేసీఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ (ఫైల్)

గతంలో వైఎస్సార్ హామీ..

గతంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బోథ్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు హామీ ఇచ్చారు. ఇందుకుగాను సర్వేలు పంపాలని అధికారులను ఆదేశించారు. వైఎస్ఆర్ మరణానంతరం కళాశాల ఏర్పాటు ఊసేలేకుండా పోయింది. ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం ప్రయత్నించలేదు.

డిగ్రీ కళాశాల మంజూరు చేయాలి



బోథ్ నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేయాలి. వచ్చే విద్యాసంవత్సరానికి అందుబాటులోకి తీసుకురావాలి. డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం జీవో జారీచేయాలి.

– మీర్ ఇర్షాద్ అలీ, బోథ్

కళాశాల నిర్మించాలి

బోథ్‌లో ప్రస్తుతం కొనసాగుతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మూడు నుంచి నాలుగు ఎకరాల స్థలం ఉంది. ఈ స్థలంలో కళాశాలను నిర్మించారు. పాత జూనియర్ కళాశాల స్థలంలో డిగ్రీ కళాశాల నిర్మించాలని పలువురు కోరుతున్నారు. కళాశాలకు రెండెకరాల ప్రభుత్వ భూమిని కేటాయించి నిర్మించాల్సి ఉంటుంది. యూజీసీ నిబంధనల ప్రకారం డిగ్రీ కళాశాలకు అనువైన స్థలం ఉందని పలువురు విద్యావేత్తలు పేర్కొంటున్నారు.

సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గుచూపాలి

ఆదిలాబాద్‌టౌన్: రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గుచూపాలని మీరాక్లీన్ సంస్థ సీనియర్ నేషనల్ ప్రైమ్ బీడీఎస్ కిశోర్ రాథోడ్ అన్నారు. మంగళవారం కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించి బయో ఇంధన ఉత్పత్తి ప్రాజెక్టులపై అవగాన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో గ్లోబల్ వార్మింగ్ పెరుగుతోందని, దాన్ని తగ్గించే దిశగా బయో ఇంధన ఉత్పత్తి ప్రాజెక్టులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పర్యావరణం, నేల సంరక్షణ కోసం తమ సంస్థ ఏర్పాటైందన్నారు. మొదట బయో ఇంధన ఉత్పత్తి ప్రాజెక్టులను ప్రతి తాలుకలో ఏర్పాటు చేసేలా ప్రణాళికలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే 14 రాష్ట్రాల్లో 4,600 సీఎన్బీ బుకింగ్‌లు పూర్తి చేశారని, నాలుగు నెలల్లో వాటిని ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ మాట్లాడారు. రైతులను ఆర్థికంగా చేయూత ఇచ్చేలా ప్రాజెక్టులను పెడుతున్నట్లు తెలిపారు. ఎంసీఎల్ సంస్థ అడ్వైజర్లు అంజనేయులు, అడిషనల్ ఎస్పీ రాములు నాయక్, వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య, కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

నష్టపోయిన పంటలపై సర్వే చేపట్టాలి

బోథ్: మండలంలోని కనుగుట్ట, కిష్టాపూర్ శివారం గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన పంటలపై వ్యవసాయ అధికారులు సర్వే చేపట్టాలని రైతులు కోరారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ అతికోద్దిన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయాధికారులు కేవలం 33 శాతం దెబ్బతిన్న పంటలను సర్వే చేస్తున్నారని అన్నారు. అంతకన్నా తక్కువగా పంటలు దెబ్బతిన్నట్లు కాదా అని ప్రశ్నించారు. సర్వే నిర్వహించకుంటే ఆందోళనలు చేపడుతామన్నారు. రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న తదితరులు ఉన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

ఓబీసీలను మోసగిస్తున్న ప్రభుత్వం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్

ఆదిలాబాద్: ఓబీసీలను ప్రభుత్వం మోసగిస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ ఆరోపించారు. వారి సంక్షేమాన్ని విస్మరించిందని, రుణాలు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం పల్లె పల్లెకు ఓబీసీ–గడపగడపకు బీజేపీ కార్యక్రమానికి సంబంధించిన గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 6 నుంచి 15 రోజులపాటు ఈ కార్యక్రమం బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి, ఆదినాథ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాజుయాదవ్, గటిక క్రాంతి కుమార్, వెంకన్నయాదవ్, శ్రీనివాస్, మయూర్ చంద్ర, రాందాస్, వినోద్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పాయల్ శంకర్

ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయండి

- జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు

నార్నూర్: మండల కేంద్రంలోఈనెల 9న నిర్వహించే బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రైవెట్ జిన్నింగ్‌లో జరిగే ఆత్మీయ సమ్మేళన స్థలాన్ని వారు పరిశీలించారు. 2 వేల మంది కార్యకర్తలు హాజరయ్యేలా స్థలాన్ని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామం నుంచి వంద నుంచి 200 మందిని తరలించాలన్నారు. ఎంపీపీ కనక మోతుబాయి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మెస్రం హన్మంతరావు, సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ జాదవ్, ఎంపీటీసీ పరమేశ్వర్, కార్యదర్శి సయ్యద్‌ఖాశీం, విద్యార్థి విభాగం అధ్యక్షుడు కొర్రెళ్ల మహేందర్, 23 గ్రామ పంచాయతీల సర్పంచులు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న రాథోడ్ జనార్దన్, ఆత్రం సక్కు

సంక్షిప్త వార్తలు

వాహనదారులకు అవగహన

తలమడుగు: మండలంలోని దేవపూర్, రుయ్యాడి, తలమడుగు గ్రామాల్లో ఆర్టీఏ అధికారులు వాహనాదారులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రామారావు మాట్లాడారు. వాహనాదారులు రోడ్డు నింబధనలు పాటించాలని అన్నారు. సర్పంచులు పాల్గొన్నారు.

దీక్షాపరులకు భిక్ష

సిరికొండ: మండలంలోని కొండాపూర్‌లో హనుమన్ దీక్షాపరులకు ఏఐసీసీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్‌నాయక్ ఆధ్వర్యంలో భిక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారికి అన్నదానం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు షేక్ ఇమామ్, నాయకులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు చెల్లించాలి

బోథ్: బీడీ కార్మికులకు పెరిగిన వీడీఏను ఏప్రిల్ 1నుంచి యాజమాన్యం చెల్లించాలని బీడీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోవర్ధన్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడారు. బీడీ కార్మికులకు రూ.10.04ల వీడీఏ పెరిగిందన్నారు. యాజమాన్యాలు స్పందించి పెరిగిన వీడీఏతో వెయ్యి బీడీలకు రూ. 232.04 చొప్పున ఇవ్వాలన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

తాంసి: పోషకాహారంతోనే చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని తాంసి సర్పంచ్ కృష్ణ అన్నారు. పోషణ పక్వాడ్‌లో భాగంగా మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు మంగళవారం వెల్ బెబీషో కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో ఆరోగ్యంగా ఉన్న చిన్నారులకు ఐసీడీఎస్ తరఫున సర్టిఫికెట్లు సర్పంచ్ అందజేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి

నేరడిగొండ: పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని స్థానిక వార్డు సభ్యుడు సాబ్లే సంతోష్ సింగ్ అన్నారు. నేరడిగొండలోని 3వ అంగన్‌వాడీ కేంద్రంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన చిన్నారులకు 5వ రౌండ్ పోషణ పక్షంలో భాగంగా మొదటి మూడు ర్యాంకులు సాధించిన వారికి మంగళవారం ప్రశంస పత్రాలను అందజేశారు.

నేడు వైద్యశిబిరం

ఆదిలాబాద్‌టౌన్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం జైనథ్ మండలం మేడిగూడలో వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి శిబిరంలో రోగులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తారన్నారు.

ప్రకృతితో స్నేహం చేయాలి

బోథ్: ప్రతిఒక్కరూ ప్రకృతితో స్నేహం చేయాలని ప్రకృతి ప్రేమికుడు వెంకటేశ్ అన్నారు. మండలంలోని పొచ్చర క్రాస్‌రోడ్డు వద్ద సెయింట్ థామస్ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం ప్రకృతి, పర్యావరణం, పక్షుల, జంతువులు, మొక్కల ఆవశ్యకత గురించి వివరించారు. వేసవిలో పక్షుల దాహార్తిని తీర్చేందుకు నీటి తొట్టీలు ఏర్పాటు చేయాలన్నారు. కరస్పాండెంట్ ఇమ్మాన్యుయెల్ జాకోబ్, హెచ్ఎం స్మిత జార్జ్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు

జైనథ్: పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నైనత అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్‌లో నిర్వహిస్తున్న పది పరీక్ష కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున విద్యార్థుల కోసం ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచామన్నారు. ఆమె వెంట ఏఎన్ఎంలు, ఇతర సిబ్బంది ఉన్నారు.

అన్నివర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ లక్ష్యం

ఇంద్రవెల్లి: అన్నివర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ లక్ష్యమని పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ నాయకుడు పెందోర్ ప్రభాకర్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో అంతా అవినీతిమయం అయిందన్నారు. ఎనిమిదేళ్లలో రాష్ట్రాన్ని అప్పుల తెలంగాణగా మార్చిన సీఎం కేసీఆర్.. ఇప్పుడు టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చి ఏమి ఉద్ధరిస్తారని ఎద్దేవా చేశారు. ఎన్నికల హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. పేపర్ లీకేజీతో నిరుద్యోగుల ఆశయాలు వమ్ము చేసిందన్నారు. పార్టీ సీఎల్పీ నాయకుడు భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్ర 250 కి.మీ చేరిన సందర్భంగా మంచిర్యాల జిల్లాలో ఈనెల 8న జరిగే బహిరంగ సభకు కార్యకర్తలు తరలిరావాలని కోరారు. సమావేశంలో నాయకులు పుసం ఆనంద్ రావ్, పుర్క బాపురావ్, సోమోరే నాగోరావ్, దిలీప్, ముఖడే ఉత్తం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభాకర్, తదితరులు

ఓసీలంతా ఏకతాటిపైకి రావాలి

జైనథ్: బ్రహ్మణ, రెడ్డి, ఆర్యవైశ్య, మార్వాడి, వెలమ, గుజరాతీలంతా ఏకమైన తమ హక్కుల సాధన కోసం కృషిచేయాలని ఓసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు జనగం సంతోష్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సంఘం సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘం నాయకులతో కలిసి సంఘం జిల్లా కమిటీ ప్రమాణ స్వీకారమహోత్సవం కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 9న ఆదిలాబాద్‌లోని సెంట్రల్ గార్డెన్‌లో జిల్లా కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓసీలంత అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. సంఘం మండల అధ్యక్షుడు మామిడి మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి పుండ్రు అశోక్ రెడ్డి, ఉపాధ్యాక్షులు నోముల రవి కిరణ్‌రెడ్డి, సనత్‌రెడ్డి, నాయకులు క్యాతం శివ ప్రసాద్‌రెడ్డి, అల్లూరి ప్రవీణ్‌రెడ్డి, అడ్డి శ్రీకాంత్‌రెడ్డి, రమేశ్ రెడ్డి ఉన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న సంతోష్, నాయకులు

విద్యాశాఖ మంత్రి బాధ్యత వహించాలి

ఆదిలాబాద్‌టౌన్: పదో తరగతి పరీక్ష పేపర్ లీకేజీపై విద్యాశాఖ మంత్రి సబిత బాధ్యత వహించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సిడాం సాయికుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలోని సంఘ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వికారాబాద్ జిల్లా తాండూర్‌లో టెన్త్ పేపర్ లీకేజీ ఘటనపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. ఆ సమయంలో ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలో జవాబుపత్రాలు మాయం కావడం రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమని పేర్కొన్నారు. టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంపై విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో తాజాగా టెన్త్ పేపర్ లీక్ కావడం ఆందోళనకు గురిచేస్తోందన్నారు. దీనికి విద్యాశాఖ మంత్రి బాధ్యత వహించి రాజీనామా చేయాలని లేకపోతే జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కుమ్ర అశోక్, నాయకులు శ్యాంసుందర్, రజినీకాంత్, రవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాయికుమార్, తదితరులు

కంటి వెలుగుకు ఆదరణ

- మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్

ఆదిలాబాద్‌టౌన్: కంటి వెలుగు కార్యక్రమానికి ఆదరణ పెరుగుతోందని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. పట్టణంలోని హమాలివాడ పరిధిలో గల భుక్తపూర్ వార్డులో మంగళవారం రెండోవిడత కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంధత్వ నివారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమం చేపడుతుందన్నారు. అనంతరం శిబిరానికి హాజరైన వారికి నిర్వహించిన కంటి పరీక్షలు, మందులు, కళ్లద్దాల పంపిణీ తదితర అంశాలను పరిశీలించారు. ఇప్పటివరకు అర్బన్‌లో 38,528 మందికి సేవలందించామని, జిల్లా వ్యాప్తంగా ఈ శిబిరాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కౌన్సిలర్లు బండారి సతీశ్, డాక్టర్ లక్ష్మణ్, సీవో రానీత, సుదర్శన్, ఇబ్రహీం, వినోద్ తదితరులు ఉన్నారు.



కళ్లద్దాలు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, తదితరులు

మసీద్‌ల వద్ద ప్రత్యేక చర్యలు

కైలాస్‌నగర్: రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఆచరిస్తున్న వారికి మసీదులో ప్రార్థన సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. స్థానిక కేఆర్‌కే కాలనీలోని మదీనా మసీదు వద్ద సమస్యలున్నాయని కమిటీ సభ్యులు ఆయన దృష్టికి తీసువచ్చారు. వైస్ చైర్మన్ జహీర్ రంజానీతో కలిసి మసీదును మంగళవారం సందర్శించారు. అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. రోడ్డుపై నీరు నిలువడంతో బురద పేరుకుపోతోందని సభ్యులు చైర్మన్ దృష్టికి తీసుకురాగా అధికారులతో మాట్లాడి మొరం వేయించారు. అనంతరం తడి, పొడి చెత్త సేకరణ కోసం డస్ట్‌బిన్లు అందజేశారు. ఆయన వెంట మసీద్ కమిటీ అధ్యక్షుడు సాదుల్ల, ఇమామ్ ఇనాయత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేందర్ ఉన్నారు.

సాదాసీదాగా సమావేశం

గుడిహత్నూర్: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నాగర్‌గోజే భారత్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. అధికారులు ప్రజాప్రతినిధులు పూర్తిస్థాయిలో హాజరుకాలేదు. 26 మంది సర్పంచులకు గాను ఆరుగురు, 9 మంది ఎంపీటీసీల్లో ఆరుగురు హాజరయ్యారు. హాజరైన శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. మన ఊరు–మనబడి కింద చేసిన పనుల బిల్లులు సకాలంలో రావడం లేదని జెడ్పీటీసీ పతంగే బ్రహ్మానంద్ అన్నారు. గుడిహత్నూర్ పీహెచ్‌సీలో డెలివరీ అయిన బాలింతలకు భోజనం అందించడం లేదని, ఇంటి నుంచి తెచ్చుకుంటున్నారని, మరోవైపు వారి నుంచి సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నారని గుడిహత్నూర్ సర్పంచ్ జాదవ్ సునీత ఆరోపించారు. దీనిపై డాక్టర్ శ్యామ్ సుందర్ మాట్లాడుతూ బాలింతలకు తాము భోజనం అందిస్తున్నామని ఆమె వెంట ఉన్న కుటుంబీకులు మాత్రం ఇంటి నుంచి తెచ్చుకుంటున్నారని అన్నారు. డబ్బులు వసూళ్లపై బాధితులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఐకేపీ ఏపీఎంకు బదులు గుడిహత్నూర్ క్లస్టర్ సీసీ యాదవ్ హాజరై నివేదిక చదువుతుండగా సర్పంచ్ జాదవ్ సునీత జోక్యం చేసుకున్నారు. మహిళా సంఘాల సభ్యులు వారి డబ్బులను బ్యాంక్‌లో వేయాలని సీసీ వీవోఏలకు ఇచ్చినా ఎస్‌హెచ్‌జీ అకౌంట్‌లో వేయడం లేదన్నారు. ఐకేపీలో భారీగా అక్రమాలు జరుగుతున్నాయని ఈ సమస్యను సీరియస్‌గా తీసుకోవాలన్నారు. లేకపోతే కలెక్టర్, డీఆర్‌డీఏ అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. జెడ్పీటీసీ పతంగే బ్రహ్మానంద్, తహసీల్దార్ సంధ్యారాణి, పశు వైద్యాధికారి రాథోడ్ జీవన్, ఏవో రేవతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

చెరువులో పూడికతీత పనులు

బేల: రైతులు చెరువు మట్టిని సద్వినియోగం చేసుకోవాలని వరూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ దడంజే తుకరాం పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని వరూర్ చెరువులో సెంటర్ ఫర్ పీపుల్స్ ఫారెస్ట్రీ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో చెరువు మట్టి పూడికతీత పనులను ఆయన ప్రారంభించారు. సంస్థ టెక్నికల్ గజానన్, పంచాయతీ కార్యదర్శి కిశోర్, సిబ్బంది చౌహన్ స్వప్నిల్, భీంరావు, అకాష్, రైతులు పాల్గొన్నారు.

అదుపు తప్పి బైక్ బోల్తా

నేరడిగొండ: మండలంలోని కుంటాల జలపాతం వెళ్లే రహదారిపై మంగళవారం రాత్రి బైక్ అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. శంకరాపూర్‌కు చెందిన ఆడె అరవింద్ కుంటాల(కె) గ్రామానికి బైక్‌పై వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో చిన్నబుగ్గారం వద్ద బైక్ అదుపు తప్పి బోల్తా పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108లో నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో జిల్లాకేంద్రంలోని రిమ్స్‌కు తరలించినట్లు 108 సిబ్బంది తెలిపారు.



గాయాలైన అరవింద్

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ఎదులాపురం: ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14 నుంచి వచ్చే నెల 14 వరకు ఇంటింటికీ సీపీఐ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారికి అవగాహన కల్పించాలన్నారు. అవసరమైతే ప్రజలను ఐక్యం చేసుకుని పోరాటాలు చేపడుతామన్నారు. పార్టీ రాష్ట్ర సమితి సభ్యురాలు ముడుపు నళినిరెడ్డి, పట్టణ నాయకులు ఎస్.అరుణ్‌కుమార్, కుంటాల రాములు, బెజ్జంకి నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.